క్లుప్తంగా

పీఎఫ్ సొమ్ము చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగర కార్పొరేషన్ పరిధిలో పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే వారికి రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్ నగదు చెల్లించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఒక ప్రకటనలో నగరపాలక సంస్థ కమిషనర్‌ను కోరారు. ఇప్పటికే పీఎఫ్ సొమ్ము చెల్లించాలని మున్సిపల్ పరిపాలనా శాఖ ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఎఫ్ రుణాలు కూడా మంజూరు చేయాలని కోరారు.

13న ఐటీడీఏను సందర్శించనున్న జేసీ

ఏలూరు(మెట్రో): జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పి.ధాత్రిరెడ్డి, ఈనెల 13వ తేదీ బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తదుపరి క్షేత్ర స్థాయిలో సందర్శిస్తారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తారు.

ఆలయ ఈఓపై చర్యలు తీసుకోండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పడమర వీధి దొంగల మండపం వద్ద 20 ఏళ్ల వయసు ఉన్న రెండు వృక్షాలను అకారణంగా కూల్చి వేయించిన పడమర వీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిపై చర్యలు తీసుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్, ఏలూరు తహసీల్దార్, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంతో కాలంగా స్థానిక ప్రజలకు నీడను, చల్లదనాన్ని ఇస్తున్న వృక్షాలను కూల్చివేయడం దారుణమని పేర్కొన్నారు.

'గోపి కుటుంబానికి అండగా ఉంటాం'


గోపి తల్లి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ యువజన నేత తూర్పువీధికి చెందిన గోపి తల్లి సోమవారం మృతి చెందారు. దీంతో వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) గోపి కుటుంబాన్ని పరామర్శించి, వారికి మనోధైర్యం చెప్పారు. గోపి తల్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కష్టంలో ఉన్న పార్టీ ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. జేపీ వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

చెత్త కుప్పలతో దుర్గంధం

- ఏలూరు టూటౌన్ ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్త
- ఆర్‌ఆర్‌పేట, ఎన్‌ఆర్‌పేట లాంటి ప్రధాన మార్గాల్లోనూ ఇదే పరిస్థితి
- 10 రోజులుగా చెత్త తొలగింపులో నిర్లక్ష్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు రెండో పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోంది. చెత్తను తొలగించాలని 10 రోజులుగా స్థానికులు కార్పొరేషన్ సిబ్బంది, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేదు. ఆర్‌ఆర్‌పేట ఏరియా మొత్తం ఆస్పత్రులు ఉన్నాయి. నిత్యం వందలాది మంది ప్రజలు ఆస్పత్రులకు వైద్యం నిమిత్తం, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు వచ్చి వెళ్లే మార్గంలోనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. విద్యా సంస్థలు, ఆస్పత్రులకు నెలవైన ఎన్‌ఆర్‌పేట ప్రాంతంలోనూ నిత్యం వేలాది మంది విద్యార్థులు, వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రులకు వచ్చి వెళుతుంటారు. ఈ ప్రాంతంలోనూ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతోన్నా.. చెత్త తొలగింపులో నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఎన్‌ఆర్‌పేటలోని విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే ప్రధాన రహదారిలో పేరుకున్న చెత్త


ఆర్‌ఆర్‌పేటలోని విజయ ఆస్పత్రి రోడ్డులో వీనస్ ల్యాబ్ సమీపంలో పేరుకుపోయిన చెత్త


ఎన్‌ఆర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గుట్టగా వేసిన ఎండిపోయిన చెట్టు కొమ్మలు

కానరాని చెత్త వాహనం

ఆర్‌ఆర్‌పేట ప్రాంతంలోని విజయ ఆస్పత్రి రోడ్డులోకి గత 10 రోజులుగా కార్పొరేషన్ చెత్త తీసుకెళ్లే వాహనం రావడం లేదని మహిళలు వాపోతున్నారు. సమస్యను శానిటేషన్ సిబ్బంది, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త సమస్యను స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళితేగాని తొలగించరేమోనంటూ ఎద్దేవా చేస్తున్నారు.

వారానికి ఒక రోజే!

అనేక విద్యా సంస్థలకు నిలయమైన ఎన్‌ఆర్‌పేటలో సైతం ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయింది. ఈ ప్రాంతంలో పనిచేస్తోన్న కొద్ది మంది సిబ్బందీ కొన్ని ఏరియాల్లోనే రోడ్లు, డ్రెయిన్లను శుభ్రం చేసి వెళుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగితాలు, కవర్లు లాంటి చెత్తను తోపుడు బండ్ల ద్వారా తీసుకెళుతున్నారని, పెద్ద సంఖ్యలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చెత్తను తరలించే వాహనం వారానికి ఒకరోజు వస్తుండడంతో చెత్త కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోందని వాపోతున్నారు.

పేరుకుపోతున్న చెత్త



ఆర్‌ఆర్‌పేట ప్రాంతంలో రోజుల తరబడి చెత్తపేరుకు పోతోంది. శానిటేషన్ సిబ్బంది ప్రధాన రహదారి వెంబడి చెత్తను శుభ్రం చేస్తున్నారే తప్ప, ప్రధాన రహదారిని అనుకుని ఉన్న వీధుల్లో చెత్తను తీసుకెళ్లడంలేదు. శానిటేషన్ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చినా తొలగించడంలేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– వీవీఎస్ ప్రసాద్, ఆర్‌ఆర్‌పేట, ఏలూరు

తక్షణం చెత్తను తొలగించాలి



నగరంలో ఎక్కడి కక్కడ పేరుకు పోయిన చెత్తను తక్షణం తొలగించాలి. ఇళ్ల వద్ద చెత్తను సేకరించే సిబ్బంది ప్రధాన కూడళ్లలో పేరుకుపోయిన చెత్తను తీసుకెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. చెత్తను తరలించే వాహనాలు రోజుల తరబడి రావడం లేదు. కనీసం రోజు విడిచి రోజైనా వాహనాలు వచ్చి చెత్తను తీసుకెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పిచ్చుక ఆదిశేషు, సీపీఎం నాయకులు, ఏలూరు

సోలార్ విద్యుత్‌ను విరివిగా ఉపయోగించుకోవాలి


బాలికల వసతి గృహంలో సోలార్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌరశక్తి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక అమీనాపేటలోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆమె పరిశీలించారు. రూఫ్‌టాప్ సోలార్ సిస్టం మంచి ప్రాజెక్ట్ అని, రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఆదాతో పాటు అతితక్కువ ధరకే విద్యుత్ అందుతుందని ఆమె అన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహంలో 3 కేడబ్ల్యూ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. హాస్టల్లో సోలార్ ప్లాంట్ అమరిక ముందు నెలకు 950 యూనిట్లు వినియోగం ఉండగా, 3 కేడబ్ల్యూ సోలార్ ఏర్పాటు తదుపరి 432 యూనిట్లు వినియోగిస్తున్నట్టు చెప్పారు. గతంలో నెలలో సుమారు 9 వేల వరకు విద్యుత్ చార్జీలు అవుతుండగా, సోలార్ ప్లాంట్ పెట్టడంతో సుమారు నెలకు రూ.4,500 మాత్రమే బిల్లు వస్తుందని, సుమారు 50 శాతం వినియోగం చార్జీలు తగ్గించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ అంబేద్కర్, ఏడీఈ రాజ్ కుమార్, సోలార్ ప్లాంట్ వెండర్ సతీష్, ఎలక్ట్రికల్ ఏఈ ప్రసన్నవల్లి, తహసీల్దారు జీవీ శేషగిరి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు


దత్తక్షేత్రంలో స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న భక్తులు


పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా నగరంలోని పలు శైవక్షేత్రాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆయా ఆలయాల్లో ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి ఉదయం మహన్యాస పారాయణ, లఘు న్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన, సాయంత్రం ప్రదోషకాల అర్చన, రుద్ర త్రిశతి నామార్చన, బిల్వార్చన, శివ సహస్రనామ పారాయణ నిర్వహించారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో పూర్వాషాఢ నక్షత్రంతో నిత్య పూజలు, మహన్యాస పూర్వక అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆకాశ దీప పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. శనివారపుపేట శివాలయం, పవర్ పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జనవరిలో పిల్లల సంబరాలు


బాలోత్సవం లోగోను విడుదల చేసిన గోపాలకృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): జనవరి 22, 23 తేదీల్లో హేలాపురి బాలోత్సవం 5వ పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ్ వెస్ట్ స్కూల్లో నిర్వహించేందుకు సన్నాహక కమిటీ సభ్యుల సమావేశం నిర్ణయించింది. పవర్ పేటలోని హేలాపురి బాలోత్సవం ఆఫీస్‌లో సోమవారం సాయంత్రం ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన హేలాపురి బాలోత్సవం సన్నాహక కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. 2019 నుంచి ఇప్పటి వరకు నాలుగు పిల్లల సంబరాలు విద్యాలయాల, దాతల, పెద్దల, పిల్లల ప్రేమికుల భాగస్వామ్యంతో నిర్వహించామని నాగేశ్వరరావు తెలిపారు. ఐదో పిల్లల సంబరాలు ఏలూరు నగరం, 8 మండలాల నుంచి ప్లే స్కూల్ నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు 60కు పైగా అంశాల్లో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించేలా సంబరాలు నిర్వహించనున్నామని చెప్పారు. డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ కళ, నైపుణ్య అభివృద్ధి, సామాజిక స్పృహ పెరగడానికి బాలోత్సవాలు దోహదపడుతున్నాయన్నారు. హేలాపురి బాలోత్సవం నూతన లోగోను విడుదల చేశారు. బాలోత్సవం బ్యానర్లను అడుసుమిల్లి నిర్మల, ఎమ్మెస్ ఎంఎస్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘాన్ని సమన్వయ కర్త గుడిపాటి నరసింహారావు ప్రకటించారు.

సమాచార హక్కుచట్టం సావనీర్ విడుదల


సమాచార హక్కుచట్టం సావనీర్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో రైతు గ్రూపులకు, రైతులకు సమాచార హక్కు చట్టం అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కుచట్టం-2005 అవగాహన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, ప్రచురణలతో రూపొందించిన సావనీర్‌ను కలెక్టర్ వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం-2005 కమిషనర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సంబంధిత డాక్యుమెంటేషన్ కమిషనరు కార్యాలయానికి అందజేస్తామని చెప్పారు. రైతులకు ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సమాచారం పొందడం, గడువులోగా సమాచారం రాకుంటే అప్పీలు చేసుకొనే విధానాన్ని వివరించామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ సోమవారం స్థానిక సెయింట్ థెరిసా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాల నిరోధ అంశంపై అవగాహన కల్పించారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే శారీరకంగా, మానసికంగా దృఢత్వం వస్తుందని, ఆసమయంలోనే వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ట్రైనీ జూనియర్ సివిల్ జడ్జీలు బి.రఘునాథ్, టీపీఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్, ఏపీ నాగరాజు, కె.స్పందన, జేబీటీఎస్ దేవి, డి.అరుంధతి సోషల్ వర్కర్ ఎం అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏడు మునిసిపాలిటీలు, ఏలూరు నగర కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ అమలు చేయలేదని, వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు డీఈఓను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమెకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితా విడుదల చేయలేదని తెలిపారు. ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించి 70:30 నిష్పత్తిలో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13వ తేదీలోగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించి, ఆర్డర్స్ కాపీలు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అందిస్తామని డీఈఓ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రుద్రాక్షి రవికుమార్, ఏలూరు జిల్లా మున్సిపల్ కన్వీనర్ ఈడే శివశంకర్ రావు, నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు తదితరులున్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడారు.

వ్యవసాయానికి నిధుల కేటాయింపు పెంచాలి


కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ నామమాత్రపు కేటాయింపులతో అన్నదాతలకు ఒరిగేదేమీ లేదని, పైగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపుకు నిధులు కేటాయించి రైతు మెడకు ఉరితాడు బిగించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం స్థానిక అన్నే భవనంలో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.94 లక్ష కోట్లు కాగా, ఇందులో రూ.42 వేల కోట్లతో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ రూపొందించారని, రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, నామమాత్రపు కేటాయింపుల వల్ల అన్నదాతలకు ఒరిగేదేమీ లేదని వివరించారు. గత ప్రభుత్వంలో మోటార్లకు మీటర్లు బిగిస్తే పీకేయండని రైతులకు పిలుపు ఇచ్చిన టీడీపీ, జనసేన వారే ఇప్పుడు మీటర్ల బిగింపుకు నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధులు కేటాయించడం హర్షణీయమని, వెంటనే రైతులకు, కౌలు రైతులకు సాయం అందించాలని కోరారు. ధాన్యానికి బోనస్ ప్రకటించి ఆదుకోవాలని అన్నదాతలు కోరినా రాష్ట్ర ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి, ఉద్యాన పంటల మార్కెటింగ్‌కు తగిన నిధులు కేటాయింపు లేదని చెప్పారు. ఉద్యాన పంటలకు రాయితీలు, పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని, బకాయిలు చెల్లింపుకు ప్రతిపాదనలు చేయలేదని తెలిపారు. పంటల బీమా పథకం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని అన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించలేకపోయారని ఎద్దేవా చేశారు.

పాఠశాలను సందర్శించిన జర్మన్ వాసి


పిల్లలకు ఆట వస్తువులు అందించిన జర్మన్ వాసి

ఏలూరు రూరల్ : ఏలూరు వైఎస్సార్ నగర్ ఎంపీయూపీ పాఠశాలను జర్మన్ దేశస్థుడు మైఖేల్ సందర్శించారు. ఉదయం 11 గంటలకు స్థానిక ట్రేస్ సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో తదితరులతో కలిసి వచ్చిన ఆయన పాఠశాల పిల్లలతో ముచ్చటించారు. పిల్లలు ఆడుకునేందుకు క్యారమ్‌బోర్డ్స్ బహూకరించారు. ఆట స్థలం మెరక చేసేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుడు జీజేఏ స్టీవెన్, కిరణ్‌కుమారి తదితరులు ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. అనంతరం మైఖేల్ పోణంగి రోడ్డు పక్కన కార్పొరేషన్ డంప్‌యార్డ్ పరిసర ప్రాంతాల్లో పిల్లలతో ముచ్చటించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	88
వంకాయలు (కాంతులు)	48-64	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36-48	ములక్కాడలు	07, 10
బెండకాయలు	30	కంద	64
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	54
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	88
బీరకాయలు (పందిరి)	00	అల్లం	80
క్యాబేజీ	36-40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	45-55	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	44	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40